సాక్షి నిర్మల్

బుధవారం । 7 । ఆగస్టు । 2024



క్రీడలకు మహర్దశ..!

రాష్ట్రంలో నూతనంగా క్రీడా పాలసీ తీసుకు రావడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీంతో రాష్ట్రంలో క్రీడారంగం ఎంతగానో అభివృద్ధి చెందనుంది. 8లో▸

ఏఈఈగా నిర్మల్ యువకుడు



నిర్మల్ రూరల్: టీజీపీఎస్సీ ఇటీవల ప్రకటించిన ఉద్యోగ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు చింత ముత్తన్న-యశోదల కుమారుడు మనోజ్ ఏఈఈ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఓపెన్‌లో కాంపిటీషన్లో భారీ నీటిపారుదల శాఖలో ఉద్యోగం సాధించాడు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.4 / 24.2

ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని చాలాప్రాంతాల్లో వర్షం కురుస్తుంది.

వచ్చినప్పుడే వైద్యం!



భైంసా ఏరియా ఆస్పత్రిలో బారులుతీరిన రోగులు





నిర్మల్ జిల్లా ఆస్పత్రిలో సమయానికి వైద్యులు రాక ఖాళీగా ఉన్న కుర్చీలు

- జ్వరాలకాలంలోనూ విధులకు ఆలస్యంగా వైద్యులు, సిబ్బంది
- ఆస్పత్రుల్లో రోగులకు తప్పని నిరీక్షణ
- రోజురోజుకూ పెరుగుతున్న జ్వర బాధితులు
- ప్రభుత్వాస్పత్రులను విజిట్ చేసిన 'సాక్షి'

నిర్మల్‌చైన్‌గేట్/నెట్‌వర్క్: జిల్లాలో సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌లతోపాటు వివిధ సీజనల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. పెద్దలతోపాటు చిన్నారులూ జలుబు, దగ్గు, జ్వరం, వైరల్ ఫీవర్లతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. పల్లె, పట్టణం తేడా లేకుండా జనం మంచంపడుతున్నారు. ఈ సీజన్‌లో అప్రమత్తంగా ఉండాల్సిన వైద్యారోగ్యశాఖ కాసింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సకాలంలో ఆస్పత్రులకు వచ్చి సేవలు అందించాల్సి ఉండగా, సమయానికి వైద్యులే కాదు సిబ్బంది కూడా రావడం లేదు. సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులను 'సాక్షి' మంగళవారం విజిట్ చేసింది.

పెద్దాస్పత్రికి క్యూ..

సీజనల్ వ్యాధుల ప్రభావంతో కొద్దిరోజులుగా నిర్మల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వస్తున్న రోగులు క్యూకడుతున్నారు. ప్రధాన ఆస్పత్రి కావడం, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండడంతో ఎక్కువమంది ఇక్కడికే వస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఓపీ వద్ద క్యూ మొదలై ఆ తర్వాత గంటగంటకు పెరుగుతోంది. ఓపీ సేవలతోపాటు ఇన్‌పేషంట్‌లు కూడా పెరుగుతున్నారు. దీంతో వార్డుల్లో బెడ్లు నిండిపోతున్నాయి. నిత్యం వెయ్యిమందికి పైగా వస్తుండగా, వీరిలో 150 నుంచి 200 మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు.

16 మందికి డెంగీ..

దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడంతో జిల్లాలోని గ్రామాలు, గిరిజన తండాల్లో ప్రజలు డెంగీ, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 16 డెంగీ కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా వందకు పైనే ఉంటాయని తెలుస్తోంది. రాబోయే రోజుల్లో కేసులు మరిన్ని పెరిగే అవకాశం ఉంది.

అరగంట ఆలస్యంగా..

జిల్లా జనరల్ ఆసుపత్రిలో డాక్టర్ల నిర్లక్ష్యంతో రోగులకు కష్టాలు తప్పడం లేదు. స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారని వైద్యం కోసం వస్తున్న రోగులకు ఇక్కడ చుక్కెదురవుతోంది. సమయపాలన పాటించకుండా డాక్టర్లు ఆలస్యంగా వస్తున్నారు. ఓపీ విభాగంలోనూ సమయ పాలన పాటించడం లేదు. దవాఖానలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఓపీ నిర్వహిస్తారు. చాలామంది డాక్టర్లు మాత్రం 9.30 గంటల తర్వాతే వస్తున్నారు. కేవలం చిన్నపిల్లల విభాగంలో మాత్రమే సమయానికి ఓపీ ప్రారంభించారు. మిగతా అన్ని విభాగాలలో ఉదయం 9.30 గంటల తర్వాతనే ప్రారంభమయ్యాయి.

గంటసేపు ఎదురుచూపు..



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు పోసాని. లోకేశ్వరం మండలం మన్మథ్ గ్రామం. రెండు రోజులుగా తీవ్రమైన ఒంటినొప్పులు, జ్వరంతో బాధపడుతోంది. చికిత్స కోసం మంగళవారం జిల్లా జనరల్ ఆసుపత్రికి ఉదయం 8:30 గంటలకు వచ్చింది. 9 గంటలకు వైద్యులు రావాల్సి ఉంది. వైద్యులు సకాలంలో రాకపోవడంతో నిల్చునే ఓపిక లేక సంబంధిత వార్డు ఎదుటే ఇలా కూర్చుని డాక్టర్ కోసం ఎదురుచూసింది.

9.30 తర్వాత వచ్చారు..



నిర్మల్ పట్టణం మంజులాపూర్ కాలనీకి చెందిన భూమయ్యను సోమవారం కోతులు కరిచాయి. వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి ఉదయం 8:50 గంటలకు వచ్చాడు. ఓపీ స్లిప్ తీసుకున్నాడు. కానీ వైద్యులు మాత్రం 9:30 తర్వాతనే వచ్చారు. అప్పటివరకు ఆయన ఓపీ ఎదుటే ఎదురుచూడాల్సి వచ్చింది.

కుంటాలలో ఆరుబయటే వైద్యం..



తాత్కాలిక షెడ్డులో రోగులు

కుంటాల: కుంటాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మరమ్మతులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో రోగులకు ఆరుబయటే తాత్కాలిక షెడ్డులో వైద్యం అందిస్తున్నారు. వారం రోజుల నుంచి ఓపీ 200లకుపైగా నమోదువుతోంది. వైద్యశాలలో తాగునీటి వసతి లేక సిబ్బందితోపాటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు వినియోగంలో లేవు. వైద్యశాలలో ఫార్మసిస్ట్, ఎల్‌టీ, రెండు ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముధోల్ నుంచి ల్యాబ్ టెక్నీషియన్ మూడు రోజులకోసారి వచ్చి రక్త నమూనాలు సేకరిస్తున్నారు.

భైంసాలో 1,954 ఓపీ..

భైంసాటౌన్: వర్షాకాలం నేపథ్యంలో పట్టణవాసులు సీజనల్ జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులతో నిత్యం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రితోపాటు కుంట ప్రాంతంలోని అర్బన్ పీహెచ్‌సీకి వందల సంఖ్యలో బాధితులు వస్తున్నారు. పట్టణ పరిధిలో ఇటీవల మూడు డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇక ఏరియాస్పత్రికి ఈనెలలో ఇప్పటివరకు 1,954 మంది ఓపీ కోసం రాగా, వీరిలో ఎక్కువగా జ్వర బాధితులే.

కిటకిటలాడుతున్న ఖానాపూర్ ఆస్పత్రి

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి కొద్ది రోజులుగా రోగులతో కిటకిటలాడుతుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వైరల్ ఫివర్‌లు సోకి రోజు 300 వరకు రోగులు వస్తున్నారు. 50 పడకల ఆస్పత్రిలో అన్ని పడకలు రోగులతో నిండిపోయాయి. ఆస్పత్రిలో ముగ్గురు రెగ్యూలర్ వైద్యులతోపాటు ఐదుగురు కాంట్రాక్టు వైద్యులు ఉన్నారు. వీరిలో ఇద్దరు పీజీ లీవులో ఉండగా, మరొకరు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రిలోని ఎక్స్‌రే యంత్రం మరమ్మతులు చేయడంతోపాటు అందులో అధికారిని నియమించాల్సి ఉంది.

లక్ష్మణచాందలో పోస్టులు ఖాళీ..

లక్ష్మణచాంద: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఒక మెడికల్ ఆఫీసర్, మొదటి ఏఎన్‌ఎం పోస్టులు 3, ఎన్‌హెచ్‌ఎం ఒక పోస్టు ఖాళీగా ఉంది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఉదయం 9 గంటలకు ఆస్పత్రికి రాగా, సిబ్బంది మాత్రం ఆలస్యంగా వచ్చారు.

ఉరుస్తున్న ఆస్పత్రి..

తానూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని విజిట్ చేయగా వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఉదయం 11 గంటల వరకు 64 మందిని ఓపీ చూ శారు. ఇక్కడ రోగులు ఉండే గదిలో పైకప్పు ఉరుస్తోంది. కింద కూడా నీరు నిలుస్తోంది.

వైద్యుల్లేక ఇబ్బందులు..

కడెం: మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో రోజూ 80మంది వరకు ఓపీ వస్తున్నారు. ఇక్కడ మందులు అందుబాటులో ఉన్నా.. రెగ్యులర్ వైద్యులు ఉండటం లేదు. దీంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

అపరిశుభ్రంగా ఆస్పత్రి ప్రాంగణం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 30పడకల సామాజిక ఆస్పత్రిలో వారంలోనే 570 ఓపీ నమోదైంది. ఇటీవల బదిలీల్లో ప్రత్యేక వైద్యులను నియమించారు. త్వరలో ప్రసూతిసేవలు ప్రారంభంకానున్నాయి. ఆస్పత్రి ప్రాంగణమంతా అపరిశుభ్రంగా ఉంది. ఎక్కడ పడితే అక్కడ నీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారింది. జ్వరాలు తగ్గించుకోవాలని వచ్చే పేషెంట్లకు ఇక్కడి వాతావరణం భయపెడుతోంది.

న్యూస్‌రీల్

బాల రచయితకు సత్కారం



బాల కవయిత్రి మేధాశ్రీ ని సన్మానిస్తున్న నిర్మలభారతి క్షేత్రం సాహితీవేత్తలు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని మేధశ్రీ ఇంగ్లిష్‌లో కవిత సంకలనాన్ని రచించి సాహితీప్రతిభ కనబర్చడం పలువురికి స్ఫూర్తిదాయకమని నిర్మల భారతి సాహితి సాంస్కృతిక సేవా క్షేత్రం జిల్లా అధ్యక్షుడు, ప్రముఖకవి తాడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. జిల్లాకేంద్రంలో బాల రచయిత మేధశ్రీని మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అతిపిన్న వయసులోనే ఆంగ్ల రచయిత్రిగా పుస్తకాన్ని రచించడం గొప్ప విశేషమని కొనియాడారు. ఆంగ్ల సాహిత్యంలో మరింతగా రాణించి తోటి విద్యార్థులకు, యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. చిన్నారిని వారి తల్లిదండ్రులైన లక్ష్మి మధుమోహన్ మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్మల భారతి సంస్థ ఉపాధ్యక్షుడు అంబటి నారాయణ, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సాయినాథ్ రెడ్డి, చిన్నారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గడువులోగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిశీలించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో మున్సిపాలిటీల అభివృద్ధి, వివిధ అంశాల పురోగతిపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల వారీగా సంబంధిత వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను తదుపరి దశకు పంపాలన్నారు. పట్టణాల్లో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు రాజు, రాజేశ్‌కుమార్, మనోహర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం నిర్మిద్దాం

నిర్మల్‌చైన్‌గేట్: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్, క్షయ, కుష్ఠు వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి కోరారు. యువజన దినోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు పరుగు పందెం, రీల్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నవసమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, అధ్యాపకులు రజిత, శ్రీహరి, రమేశ్‌రెడ్డి, కస్తూరి బాపాఠశాల ఉపాధ్యాయులు శ్రీలత, జయలక్ష్మి సరిత, భాగ్యలక్ష్మి, రజిని, వీణావాణి, ఐసీటీసీ కౌన్సిలర్లు ఎల్లేశ్, సుదర్శన్, శ్రీనివాస్, ఎల్‌డబ్ల్యూఎస్ సూపర్‌వైజర్ శశిమాల పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్డీవో

నిర్మల్ రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని చదవాలని ఆర్డీవో రత్నకుమారి సూచించారు. మండలంలోని చిట్యాల ప్రభుత్వ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. తరగతులకు వెళ్లి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీఈవో శ్రీనివాస్‌గౌడ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం గజపల్లి నరసయ్య, ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్ రెడ్డి, వహీద్, సంతోష్, షబ్బీర్ అలీ పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగస్వాములు కావాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ కోరారు. పట్టణంలోని సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి నాయుడివాడ, గాంధీచౌక్ వీధుల గుండా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యలో ప్రజలు, వ్యాపారులతో మాట్లాడారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవా లని తెలిపారు. తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి నిర్వహించారు. కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

పల్లెలు మెరవాలి

సోన్: స్వచ్ఛదనం-పచ్చదనంతో పల్లెలు మెరవాలని జెడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. సోన్, న్యూబొప్పారం, న్యూవెల్మల్, సంగంపేట, కూచన్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్, ఎంపీవో ఖలీల్ హైమద్, ఏపీవో మంజుల, ఐకేపీ ఏపీవో గంగమణి, శోభ, ఏఈ దేవీదాస్, ప్రత్యేకాధికారి రాజమల్లు, నర్సారెడ్డి, భూపాల్‌రెడ్డి, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, వీపీవోలు పాల్గొన్నారు.

తాగునీటి వనరులపై ప్రత్యేక శ్రద్ధ

కుంటాల: తాగునీటి వనరులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ఓలా, కుంటాల, కల్లూరు గ్రామాల్లో తాగునీరు, చెరువులు, కుంటలు కలుషితం కాకుండా ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఇంకుడుగుంతల ఆవశ్యకతను వివరించారు. ప్రతీ నీటిబొట్టును ఒడిసిపట్టాలని సూచించారు. ఎంపీడీవో ఎం.ఏ.రహీం, ఎంఈవో ముత్యం, ఏపీవో గట్టుపల్లి నవీన్, ఏపీఎం అశోక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడికి బాసట

- పరిశుభ్రతకు ప్రత్యేక నిధులు..
- పారిశుధ్య సమస్యలకు ఇక చెల్లు..



జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా: సర్కారు బడుల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక నిధులను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో సర్కారు బడుల్లో పారిశుధ్య కార్మికుల నియామకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లయింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో జిల్లాలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ పరిధిలోని పాఠశాలల నిర్వహణ ఇక మెరుగు పడనుంది. ఇప్పటికే పాఠశాలల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించింది. అభివృద్ధి పనులను ఈ కమిటీల ఆధ్వర్యంలోనే చేపడుతున్నారు. తాజాగా పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య కనుగుణంగా పారిశుధ్య నిర్వహణకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది.

సీఎం మీటింగుకు ముందు ఉత్తర్వులు...

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రెండు మూడేళ్లుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. అమ్మ ఆదర్శపాఠశాల, పీఎంశ్రీ తదితర కార్యక్రమాల ద్వారా పాఠశాలలు కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. అయినా పారిశుధ్య నిర్వహణకు సర్వీస్ పర్సన్ లేకపోవడం సమస్యగా మారింది. అపరిశుభ్ర పరిసరాలు, మరుగుదొడ్ల నిర్వహణ, తరగతి గదులు ఊడ్చేవారు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 2వ తేదీన రాష్ట్ర రాజధాని హైదరాబాదులో పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తూ ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ మేరకు ఉత్తర్వులు కూడా ఇటీవల జారీ అయ్యాయి. కాగా ఈ ఉత్తర్వులు జూలై 30 తేదీనే ఉండటం గమనార్హం. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు సర్వీస్ వర్కర్లు స్కావెంజర్లను నియమించుకునే బాధ్యతలను అప్పగించారు.

ఉమ్మడిజిల్లాకు ప్రయోజనం ఇలా...

ఉమ్మడి ఆదిలాబాద్ పరిధిలోని నిర్మల్ జిల్లాలో 842, ఆదిలాబాద్ జిల్లాలో 1,279, మంచిర్యాల జిల్లాలో 847, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 1,148 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. పారిశుధ్య నిర్వాహణకు విద్యార్థుల సంఖ్యననుసరించి నిధుల విడుదల చేయడంతో ఉపాధ్యాయ సంఘాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. పాఠశాలల్లో 30 లోపు విద్యార్థులు ఉంటే నెలకు రూ.3 వేలు, 31 నుంచి 100 లోపు ఉంటే రూ.6 వేలు, 101 నుంచి 250 లోపు ఉంటే రూ.8 వేలు, 251 నుంచి 500 లోపు ఉంటే రూ.12 వేలు, 501 నుంచి 750 లోపు ఉంటే రూ.15 వేలు, 751 ఆ పైన ఉంటే రూ.20 వే లు ప్రస్తుత విద్యా సంవత్సరానికి విడుదల చేశారు.

నిధుల విడుదల హర్షణీయం..



రాష్ట్ర ప్రభుత్వం సర్కార్ బడుల్లోని పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని నియమించుకునే బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగిస్తూ నిధులు విడుదల చేయడం హర్షనీయం. కొన్ని సంవత్సరాల నుంచి పారిశుధ్య సమస్యలను అధిగమించడం ఉపాధ్యాయులకు సవాలుగా మారింది. ఈ తరుణంలో ప్రత్యేక నిధులు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం.

–ఎస్.భూమన్నయాదవ్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

బెంచ్ దిగి.. రాజీ కుదిర్చిన మేజిస్ట్రేట్

- నిర్మల్ జిల్లా కోర్టులో ఘటన



భీమలింగుతో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ భవిష్య

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ భవిష్య.. మంగళవారం బెంచ్ దిగి వచ్చి.. ఓ కేసులో ఇద్దరి మధ్య రాజీ కుదిర్చారు. జిల్లాలోని దిలవార్‌పూర్ మండలం మడేగాం గ్రామానికి చెందిన లింగోల్ల సత్యం, నవ్యశ్రీ దంపతులు. 14 ఏళ్ల క్రితం వీరి పెళ్లి జరిగింది. చాలా ఏళ్ల సంతానం కలుగకపోవడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగాయి. ఓ రోజు నవ్యశ్రీ మరుగుతున్న నూనెను భర్త సత్యంపై పోసింది. ఈ ఘటనపై బాధితుడి తండ్రి భీమలింగు దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేశారు. కేసు మంగళవారం విచారణకు రాగా నిందితురాలు నవ్యశ్రీ, ఫిర్యాదుదారు భీమలింగు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరయ్యారు. భీమలింగు మోకాళ్ల నొప్పితో నడవలేని స్థితిలో ఉండడంతో మేజిస్ట్రేట్ భవిష్య బెంచ్ దిగి అతని వద్దకు వచ్చారు. ఇద్దరితో మాట్లాడి కేసులో రాజీ కుదిర్చారు.

ప్రజల గుండెల్లో జయశంకర్‌సార్



జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

- ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: తెలంగాణ సిద్ధాంతకర్తగా, తొలితరం ఉద్యమకారుడిగా ప్రజల గుండెల్లో ప్రొఫెసర్ జయశంకర్‌సార్ శాశ్వతంగా నిలిచిపోయారని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో జయశంకర్ 90వ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ సార్ ఎంతో కృషి చేశారన్నారు. తన ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఆర్‌ఐలు రాం నిరంజన్, శేఖర్, రమేశ్, రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జయశంకర్ సేవలు మరవలేనివి



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌సార్ స్వరాష్ట్రం కోసం అహర్నిశలు పోరాడారని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతిని కలెక్టరేట్‌లో నిర్వహించారు. సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా.. మలిదశ ఉద్యమానికి దిక్సూచిగా జయశంకర్‌సార్ నిలిచారన్నారు. కార్యక్రమంలో డీఆర్వో భుజంగరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమానికి ఊపిరి పోసిన గాయకుడు గద్దర్

నిర్మల్‌చైన్‌గేట్: మలిదశ తెలంగాణ ఉద్యమానికి గద్దర్ తన పాటలతో ఊపిరి పోశాడని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. గద్దర్ ప్రథమ వర్ధంతిని టీఎన్‌జీవో భవనంలో మంగళవారం నిర్వహించారు. బలమైన కమ్యూనిస్ట్ భావజాలం ఉన్న గద్దర్ ప్రత్యేక రాష్ట్రం కోసం గళం విప్పారన్నారు. కార్యక్రమంలో నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్లు గండ్రత్ ఈశ్వర్, రాజురా సత్యం, నాయకులు వెంకటస్వామి, రత్నం, సమతా సుదర్శన్, నందేడపు చిన్ను, గణేశ్, రాములు పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వెడ్మ బొజ్జు, శ్రీహరిరావు

క్లుప్తంగా

గంజాయి స్వాధీనం



గంజాయితో ఎక్సైజ్ అధికారులు

బోథ్: మండలంలోని గుర్రాలతాండలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫేకర్ అహ్మద్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గుర్రాలతాండలో దాడులు నిర్వహించగా చౌహాన్ దేవిసింగ్, చౌహాన్ గులాబ్ సింగ్‌ల వద్ద 2 కిలోల 169 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన ఎస్టీఎఫ్ ఎస్సై శివ, హెడ్ కానిస్టేబుల్ బాపూరావ్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అధికారులు

సిరికొండ: మండల కేంద్రంలో మంగళవారం అటవీ శాఖ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీరయ్య తెలిపారు. కలప విలువ రూ.30 వేల వరకు ఉంటుందన్నారు. తనిఖీల్లో అటవీ శాఖ అధికారులు ఈశ్వర్, ప్రవళిక, కలేందర్, క్యాంప్ సిబ్బంది నిరంజన్, మారుతి, లేతు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న కలపను అటవీ శాఖ కార్యాలయానికి తరలించినట్లు వారు పేర్కొన్నారు.

జయశంకర్ జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

బాసర: బాసర ఆర్జీయూకేటీలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకటరమణ సూచన మేరకు స్పెషల్ ఆఫీసర్ శ్రీమతి సృజన, అసోసియేట్ డీన్స్ డాక్టర్ పావని, డాక్టర్ చంద్రశేఖర్, మహేష్, జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు డాక్టర్ విట్టల్, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ దత్తు, కృష్ణప్రసాద్, శంకర్, శ్యాంబాబు, హరికృష్ణ, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ పీపీగా వినోద్‌రావు



అవార్డు స్వీకరిస్తున్న వినోద్‌రావు

నిర్మల్‌టౌన్: జిల్లా ప్రధాన సేషన్స్ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న కల్వకుంట్ల వినోద్‌రావు ఉత్తమ పీపీగా ఎంపికయ్యాడు. ఈ సంవత్సరం ఏడు కేసులలో నేరస్తులకు యావజ్జీవ కారాగార శిక్షలు వేయించాడు. ఇందుకుగాను డీజీపీ డాక్టర్ జితేందర్ చేతుల మీదుగా మంగళవారం హైదరాబాద్‌లో అవార్డు స్వీకరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179 [DA-5872]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

క్రీడలకు మహర్దశ..!



బాక్సింగ్ సాధన చేస్తున్న క్రీడాకారులు

'ప్రస్తుతం తల్లిదండ్రులు విద్యార్థులను చదువులపైనే ఎక్కువ సమయం కేటాయింపజేస్తూ ఒత్తిడికి కారణం అవుతున్నారు. దీంతో పిల్లలు క్రీడా అంశాలకు దూరమవుతున్నారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాలతో పాటు గౌరవం సైతం లభిస్తుంది. ఈ దిశగా విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించే విధంగా రాష్ట్రంలో నూతనంగా స్పోర్ట్స్ పాలసీ తీసుకురావాలని భావిస్తున్నాం. క్రీడా మైదానాల అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రత్యేక నిధులను కేటాయించడమే కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి దీనికి అనుగుణంగా ముందుకెళ్తాం. క్రీడలను అభివృద్ధి చేయాలన్న ధ్యేయంతో ఇప్పటికే రూ.361 కోట్లు కేటాయించాం.' అంటూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వెల్లడించారు.



జావెలిన్ విసురుతున్న క్రీడాకారిణి



అథ్లెటిక్స్ సాధన చేస్తున్న అథ్లెట్

- స్పోర్ట్స్ పాలసీ దిశగా ప్రభుత్వం కసరత్తు
- క్రీడా వసతులు మెరుగుపడే అవకాశం
- సౌకర్యాలు కల్పిస్తే రాణిస్తామంటున్న క్రీడాకారులు

ఆదిలాబాద్: రాష్ట్రంలో నూతనంగా క్రీడా పాలసీ తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. క్రీడా విధానం తీసుకువస్తే రాష్ట్రంలో క్రీడారంగం ఎంతగానో అభివృద్ధి చెందనుంది. మారుమూల గ్రామాల నుంచి పట్టణాలు, నగరాల వరకు ఎన్నో క్రీడా సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. వివిధ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులు వెలుగులోకి రావడానికి అవకాశాలు మెరుగుపడనున్నాయి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో ప్రాతినిధ్యం వహించేలా క్రీడాకారులకు తర్ఫీదు లభించనుంది. గొప్పగా రాణించే క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందనున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో క్రీడా పాలసీ తీసుకొస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడా శాఖను తన వద్దే అట్టిపెట్టుకున్న ఆయన ఇందుకు అనుగుణంగా విధివిధానాలు రూపొందించనున్నామని అసెంబ్లీ సమావేశాల్లో తెలియజేశారు. నూతన స్పోర్ట్స్ పాలసీ అమల్లోకి వస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని శిక్షకులు, క్రీడాకారులు, యువతలో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



జూడో ఆడుతున్న జూడోకాలు

పెద్దఎత్తున నిధులు

రాష్ట్రంలో నూతన క్రీడా విధానం అమలులోకి వస్తే క్రీడారంగానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుంది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రాథమిక పాఠశాల దశ నుంచి క్రీడలపై ఆసక్తి కలిగేలా పాఠశాల మైదానాలు ఏర్పాటు చేయడం, జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో స్పోర్ట్స్ అకాడమీలు, మినీ స్టేడియాల నిర్మాణానికి మార్గం సుగమం అవుతుంది. ఆయా స్టేడియాలు, అకాడమీలలో అన్ని క్రీడలు ఆడేలా క్రీడా సదుపాయాల కల్పన, ఆట పరికరాలు, శిక్షకుల నియామకం వంటి వాటిపై ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. ప్రతీ సంవత్సరం పాఠశాల, కళాశాల, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు జరిగి ప్రతిభగల క్రీడాకారులు ఎందరో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటేలా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని క్రీడా నిపుణులు పేర్కొంటున్నారు.

అందుబాటులోకి వస్తే రాణిస్తాం

ప్రభుత్వం క్రీడా పాలసీని ప్రకటిస్తే ప్రస్తుతం ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించి అధునాతన సౌకర్యాలు తీసుకురావాలని క్రీడాకారులు శిక్షకులు భావిస్తున్నారు. దీనివల్ల రాష్ట్ర, జాతీయస్థాయిల్లో పతకాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం..

ఎంతోమంది క్రీడలపై ఆసక్తి ఉన్నప్పటికీ అరకొర పాఠశాల మైదానాలు, వసతుల లేమితో ఉన్న స్టేడియాల్లో సరైన సాధన చేయలేక నైపుణ్యమైన శిక్షణను పొందలేక క్రీడల్లో వెనుకబడిపోతున్నారు. క్రీడా రంగాన్ని ఎంచుకున్న విద్యార్థులు, యువత ఉపాధి అవకాశాలు లేకుండా నిరుద్యోగులుగా మిగిలి పోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. అయితే నూతన క్రీడా పాలసీ అమలులోకి వస్తే నైపుణ్యం గల క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. వారి యొక్క టాలెంట్ అనుసరించి గొప్ప అవకాశాలు కల్పించడమే కాకుండా, పెద్ద ఎత్తున నగదు ప్రోత్సాహకాలు సైతం అందించే వీలు కలుగుతుంది. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటితే ప్రభుత్వ ఉద్యోగాలు సైతం లభించే ఆస్కారం ఉంది. పెన్షన్, బీమా వంటి అదనపు సౌకర్యాలు సైతం కల్పించే వీలుంది. ఈ విధంగా విద్యార్థి దశ నుంచి క్రీడలపై అభిరుచి కల్పించి, ఖేలో ఇండియా, ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్, ఒలంపిక్స్ వంటి విశ్వ క్రీడల్లో ప్రాతినిధ్యం వహించేలా సత్తా గల క్రీడాకారులను రూపొందించడమే లక్ష్యంగా క్రీడా పాలసీ ఉండాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలి



క్రీడా విధానం పకడ్బందీగా అమలు చేస్తే క్రీడారంగంలో గణనీయమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. నైపుణ్యం గల క్రీడాకారులు తయారై పెద్ద సంఖ్యలో పతకాలు సాధించే అవకాశం ఉంటుంది. క్రీడా సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి అధునాతన క్రీడా సౌకర్యాలు, సామగ్రి ఉంటే బలమైన పోటీదారులుగా తయారవుతారు. క్రీడా పాలసీ ప్రవేశపెట్టి ప్రణాళికాబద్ధంగా కట్టుదిట్టంగా అమలు చేస్తే గొప్ప భవిష్యత్తు గల క్రీడాకారులు ఒలింపిక్స్ పోటీల్లోనూ ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది.

– రాజు, జూడో కోచ్, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తాం



ప్రస్తుతం ఉన్న శిక్షకుల సహాయంతో మంచి శిక్షణ పొందుతున్నాం. స్పోర్ట్స్ పాలసీ వస్తే ఆటను మెరుగుపర్చుకోవచ్చు. నైపుణ్యాలు పెరిగితే ఆటలో రాణించే అవకాశం ఉంటుంది. ఉన్నత విద్యావకాశాలతో పాటు, ఉద్యోగ అవకాశాలు కూడా లభ్యమైతే ఆసక్తిగల క్రీడాకారులు ముందుకు వస్తారు. జూడోకు సంబంధించి ప్రత్యేకమైన హాల్ కేటాయించాలి. అన్ని క్రీడా పరికరాలు ఉంటే, నిరంతరం సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ రాణిస్తాం.

– హర్షవర్ధన్, జూడో స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి, ఆదిలాబాద్

ఇండోర్ స్టేడియం నిర్మించాలి



ప్రస్తుతం బ్యాడ్మింటన్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రజాదరణ పొందిన క్రీడ. మన రాష్ట్రం నుంచే పీవీ సింధు, సైనా నెహ్వాల్, శ్రీకాంత్, కశ్యప్ లాంటి వారు అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటారు. అయితే వారు అన్ని సౌకర్యాలు ఉన్న శిక్షణ కేంద్రాల్లో తర్ఫీదు పొందారు. రాకెట్స్, స్పెషల్ స్పోర్ట్స్ కిట్స్, అన్ని వసతులు గల ఇండోర్ స్టేడియం వంటివి అందుబాటులోకి వస్తే రాణించగలుగుతాం.

– ఐశ్వర్య, బ్యాడ్మింటన్, స్పోర్ట్స్ స్కూల్, ఆదిలాబాద్

అన్నీ సమకూర్చాలి..



బాక్సింగ్ క్రీడలో ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. దానికి తగినట్టు డైట్ నాణ్యంగా అందజేస్తే ఎక్కువ సేపు బాక్సింగ్ రింగ్‌లో పోరాడగలుగుతాం. క్రీడలో అత్యవసరమైన పంచింగ్ బ్యాగ్స్, గ్లౌజెస్, రింగ్ డ్రెస్ (కార్నర్స్) వంటివి సమకూర్చాలి. అవి చాలా ఖరీదైనవి. వాటిని సమకూర్చితే మెరుగ్గా రాణించే అవకాశం ఉంటుంది. ఇవి అందుబాటులో లేకపోవడంతో బాక్సర్లు సరైన సాధన చేయలేకపోతున్నారు.

– నిహారిక, బాక్సింగ్, స్పోర్ట్స్ స్కూల్, ఆదిలాబాద్

పెళ్లి చేయడంలేదని యువకుడు ఆత్మహత్య



మహమ్మద్ ఇమ్రాన్ (ఫైల్)

భైంసాటౌన్: తల్లిదండ్రులు తనకు పెళ్లి చేయడం లేదని కలత చెందిన ఓ యువకుడు భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎండీ గౌసుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కుంట ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఇమ్రాన్ (26) తనకు పెళ్లి చేయాలంటూ తరచూ ఇంట్లో గొడవ పడేవాడు. ఈ క్రమంలో కలత చెంది సోమవారం సాయంత్రం స్నేహితుడు షేక్ షకీల్‌తో కలిసి స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్దకు వెళ్లాడు. తనకు పెళ్లి చేయడం లేదంటూ స్నేహితుడితో మాట్లాడుతూనే నీటిలో దూకాడు. షకీల్ అతన్ని కాపాడేందుకు నీటిలో దూకగా లోతు ఎక్కువగా ఉండడంతో బయటకు వచ్చేశాడు. దీంతో మహమ్మద్ ఇమ్రాన్ నీటిలో మునిగి మృతి చెందాడు. మంగళవారం ఉదయం మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరి యా ఆస్పత్రికి తరలించారు. మృతుని సోదరుడు మహమ్మద్ ఇర్ఫాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ..

భైంసారూరల్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై మారుతి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దేగాంకు చెందిన గడ్డమత్తుల సుభాష్(35) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి భార్య నాగమణితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కడుపునొప్పి భరించలేక ..

బజార్‌హత్నూర్: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన పిల్లోల్ల రాములు (56) కొంతకాలంగా కడుపులో నొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా 'సఖీ'

- బాలుడి వైద్యచికిత్సకోసం ఆర్థికసాయం
- ఆపన్నహస్తం కోసం బాధిత కుటుంబం ఎదురుచూపు



రెండు కాళ్లు చచ్చుబడిన సాయిసాత్విక్

ఆదిలాబాద్‌టౌన్: వేధింపులు, కుటుంబ కలహాలు, ఇతర కేసులకు సంబంధించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు వారికి న్యాయ, వైద్య సహాయం అందించే సఖీ, మహిళా సాధికారిక కేంద్రాలు ఓ బాధిత కుటుంబానికి అండగా నిలిచాయి. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ మహిళ సఖీ కేంద్రాన్ని న్యాయం కోసం ఆశ్రయించింది. అయితే ఆ కేసు ప్రస్తుతం కొనసాగుతోంది. బాధితురాలి ఎనిమిదేళ్ల కుమారుడు సాయిసాత్విక్ ఉన్నాడు. అతని రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. ఇదివరకే ఒకసారి శస్త్ర చికిత్స చేయించారు. వైద్యులు మరోసారి చేయించాలని సూచించడంతో తనవద్ద డబ్బులు లేక దిక్కుతోచని స్థితిలో ఉంది. సఖీ కేంద్రం వారికి తన గోడును వెల్లబోసుకుంది. నిర్వాహకురాలు సరస్వతి, సిబ్బంది, జిల్లా మహిళ సాధికార కోఆర్డినేటర్ యశోద, ఐసీపీఎస్ సిబ్బంది ప్రేమ్ కుమార్ దాతల సహాయంతో మంగళవారం రూ.30,200 నగదుతో పాటు నిత్యావసర సరుకులను సైతం అందజేశారు. కాగా బాధితురాలు తన కుమారుడికి తిరుపతిలో ఉచిత శస్త్ర చికిత్స చేయించింది. మరోసారి శస్త్ర చికిత్స చేయాల్సి ఉండడంతో ప్రస్తుతం ఆ కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలనుకునే దాతలు మానవతా దృక్పదంతో ముందుకు రావాలని ఆ కేంద్రాల నిర్వాహకులు కోరుతున్నారు. ఇతర వివరాల కోసం 7013435207 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీలో శ్రావణమాసం ఆఫర్



ప్రయాణికుడికి కరపత్రం ఇస్తున్న ఆర్ఎం

నిర్మల్‌టౌన్: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని నిర్మల్ నుంచి ఆంధ్రకు ఆర్టీసీ బస్సులో వెళ్లే ప్రయాణికులకు బహుమతులు ఇవ్వనున్నట్లు ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమన్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. నిర్మల్ నుండి ఆంధ్రప్రదేశ్‌లోని వింజమూర్, ఉదయగిరి, పామూరు, కందుకూర్, కనిగిరి, పొదిలి, మార్కాపురం, దర్శి వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక గిఫ్ట్ ఆఫర్లు ప్రవేశపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రయాణం అనంతరం టికెట్ వెనకాల మీ పేరు, ఫోన్ నెంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్న వారు ఓ చీటీపైన టికెట్ నంబర్, వివరాలు రాసి బాక్స్‌లో వేయాలన్నారు.

చెరువులోపడి యువకుడు మృతి

దిలావర్‌పూర్: ప్రమాదవశాత్తు చెరువులోపడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు దిలావర్‌పూర్‌కు చెందిన షేక్ ఉమర్ (23) సోమవారం ఉదయం తన ఇంటి సమీపంలో ఉన్న కుడిచెరువులోకి చేపల వేటకు వెళ్లాడు. సాయంత్రం అవుతున్నా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆరా తీస్తున్న సమయంలో స్థానిక కుడిచెరువులో మృతదేహం లభ్యం కావడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి అంగవైకల్యంతో పాటు మూర్ఛ వ్యాధి కూడా ఉండడంతో ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో ఈ నెల 9న జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు గోడం గణేశ్, ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు కుమ్ర జంగు పిలుపునిచ్చారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా ఆదివాసీలు అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదిలాబాద్ రూరల్ మండల అధ్యక్షుడు మెస్రం కేశవ్, ఉపాధ్యక్షుడు గేడం రాము, ఆదివాసీ నేతలు శంభు, టేకం బలిరాం, ఆత్రం గణపతి, మెస్రం తులసీరాం, సీతారాం, ప్రకాష్, గోవింద్, నాగోరావ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- తప్పిన పెను ప్రమాదం



బస్సును ఢీకొట్టిన లారీ

నేరడిగొండ: మండలంలోని బంధం ఎక్స్‌రోడ్ వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తుండగా బంధం ఎక్స్ రోడ్ వద్ద నిర్మల్ వైపు మలుపు తీసుకుంటుండగా లారీ ఢీకొట్టింది. ఘటన సమయంలో బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నారు. వారికి ఎలాంటి గాయాలు కాకుండా బయట పడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన సీసీ కెమెరాలో దృశ్యాలను చూస్తే ఆ ప్రాంతంలో అండర్ పాస్ రోడ్డు నిర్మించాల్సి ఉండగా దాన్ని నిర్మించకపోవడంతో ఆ లారీ డ్రైవర్ తన మార్గంలో తాను వెళ్తున్నట్టుగా కనిపించింది. బస్సు డ్రైవర్ కొంత నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ఆ దృశ్యాలను చూస్తే తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు అండర్‌పాస్ రోడ్డు నిర్మించి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు చర్చించుకోవడం కనిపించింది.

సాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాజెక్టుల నిర్మాణం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



బ్యారేజీని పరిశీలిస్తున్న వెడ్మ బొజ్జు, శ్రీహరిరావు

మామడ: రాష్ట్రంలో సాగునీటి సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావుతో కలిసి మామడ మండలం పొన్కల్‌లో గోదావరిపై నిర్మించిన సదర్మాట్ బ్యారేజీని మంగళవారం సందర్శించారు. త్వరలోనే బ్యారేజీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. హెలీప్యాడ్ నిర్మాణ స్థలం, బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. సదర్మాట్ బ్యారేజీ సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు చివరి ఆయకట్టుకు సాగునీరందుతుందని తెలిపారు. బ్యారేజీ నిర్మాణంతో నాగదేవత ఆలయం ముంపుకు గురవతుందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, నూతన ఆలయం నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, పడాల శ్రీనివాస్, లింగన్న, శేఖర్, భూమేశ్వర్, నర్సారెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

'సదరం' కష్టాలు

సదరం సర్టిఫికెట్ కోసం నిలబడి ఉన్న దివ్యాంగులు



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రిలో మంగళవారం సదరం శిబిరం నిర్వహించారు. సర్టిఫికెట్ కోసం జిల్లా నలుమూలల నుండి దివ్యాంగులు తరలివచ్చారు. వారికి ఆస్పత్రి ఆరు బయట అధికారులు ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో అవస్థలు పడ్డారు. తాగేందుకు నీరు, కూర్చోవడానికి కనీస వసతులు కల్పించకపోవడంతో దివ్యాంగులు, వృద్ధులు, చిన్నారులు గంటల తరబడి నిలబడి ఉన్నారు.

- సాక్షి ఫొటో గ్రాఫర్ నిర్మల్



డాక్టర్ కోసం పడిగాపులు కాస్తున్న దివ్యాంగులు



సరైన వసతులు లేకపోవడంతో నిలబడే ఉన్న దివ్యాంగులు